
# నాకు నచ్చిన నా కథ



వేమకోటి సీతారామశాస్త్రి

కథ ఎలా రాయాలో తెలియని వయసు. జీవితాన్ని ఒంటరితనం, నిరాశ, బాధలు వేటకుక్కల్లా తరుము తున్నపుడు వాటినుండి తప్పించుకోవడానికి సుదూర ప్రయాణం చేశాను. అక్కడక్కడా మజిలీలు. అక్కడ కొత్త మనుషులు, కొత్త వాతావరణం, స్నేహం, ఆత్మీయత, అభిమానం, యివన్నీ తేనెసోనలై నన్నూ నా జీవితాన్ని పెనవేసుకున్నాయి. కొత్త ఊపిరిని పోశాయి.

కొన్ని అమృత క్షణాల్ని, అనుభవాల్ని వ్యక్తీకరించడానికి భాష చాలదు. గుండె మూగదై పోతుంది. తపనమాత్రం గుండెగొంతులో కొట్లాడుతుంది. అలాంటి సమయంలో చేసిన ప్రయత్నమే నా కథ "జాజిలత". చాలా సంవత్సరాల క్రితం 'యువ' మాసపత్రికలో పచురితమైంది నాకు నచ్చిన నా కథ "జాజిలత". ఇక చదవండి.

## జాజిలత

సప్త సముద్రాలు దాటి ఎక్కడో పడ్డట్టుగా రవి శ్రీకాకుళం నుండి ఆదోని చేరాడు. కాశీమజిలీల్లోని రాకుమారునిలా.

జీవితాన్ని ఒక దశలో బాధించేది నిరుద్యోగ సమస్య. దీనిని నిర్దుష్టంగా సరిదిద్దుకునేందుకు చాలా బాధలు పడాలి. ఆ బాధల్లోనే మానవుణ్ణి కరగించే వైరాగ్యం యేర్పడుతుంది. ఇన్నాళ్ళకు అతని జీవితం వొక గాడిలోపడ్డది. సర్వీసు కమీషను సెలక్షనొచ్చి ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంటులో వుద్యోగం యిచ్చారు.

ఈ ఆనందం పంచుకొనటానికి ఎవ్వరూ లేరు. సంతోషంలో గత జీవిత కష్టాలు రైలుపెట్టెలా కదలాడుతుంటే, జాయినింగు రిపోర్టుమీద సంతకం పెట్టి యిచ్చాడు. విషాద మిశ్రితమైన ఆ ఆనందంలోనే అపశృతి తళుక్కు-మంది. అప్రయత్నంగా అమ్మ జ్ఞాపకం వచ్చింది. కని పెంచిన రుణం తీర్చ నివ్వకుండానే శాశ్వతంగా దూరమయిపోయింది.

డబ్బుకన్నా, వ్యక్తి విలువ హీనమని భావించి సంచరించే వాతావరణం యితనికి సరిపడదు. చాలాకాలంగా అతనాలోచించాడు. వ్యక్తి విలువ డబ్బుతో పెరుగుతుందా! డబ్బు విలువను బట్టి వ్యక్తి పెరుగుతాడా! సమానాంతర రేఖల్లాంటి సమస్యలు, వాటి మధ్య జీవితం పెనుగులాడుతుంది. పెరుగుతుంది, ప్రయాణిస్తుంది. నలిగి, విరిగి, గతితప్పడమో, గమ్యస్థానం చేరడమో, యేదో వొకటి జరుగుతుంది. చివరకు తెలిసిన సత్యాన్ని, మనం కొన్ని సమయాల్లో విస్మరిస్తాం.

ఎండ తీవ్రతకు అతని గొంతుకు పొడారిపోయింది. మోడువారిన అతని జీవితానికి గతంలో వొక పెద్ద గాథ ఉందని, ఆ గాథలో ఒక నిండుప్రాణం బలి అయిపోయిందన్న సంగతి ఆఫీసరుగారికి తెలియదు.

మనుష్యులను చాలా తీవ్రంగా బాధించే అసాధారణ విషయాలు చాలా మందికి తేలికగా కన్పడతాయి. బయటికి వచ్చి ఆఫీసు కలయచూచాడు. ఆకాశం మీదినుంచి దేవతలు బంగారం చల్లినట్లుగా ఎండ కాస్తున్నది. పచ్చని పచ్చిక మధ్య ట్రాన్స్ఫార్మరు ఎదురుతిరిగిన వీరునిలా ఎండగాడ్పు వెండి కవచంలో మృత్యువులా ఎదిరిస్తున్నది.

సమస్య, సంతోషం, సంతాపం మానవుణ్ణి సముద్రకెరటాల్లా జీవితంలో తరుముతాయి. ఇవన్నీ లేకపోతే జీవితానికి నవ్యత్వం ఉండదేమో ననిపిస్తుంది ఒకప్పుడు.

రవి ఆలోచించాడు, తనకు ఉండడానికి ఒక కొంప కావాలి. ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతం తరలిపోయేటప్పుడు ఎదుర్కోవలసిన

క్లిష్టసమస్య. ఆ సమయంలో తోటిగుమస్తా గోపాలకృష్ణమూర్తి సహాయం లభించింది. అతనిది గుంటూరు. సన్నగా, ఎర్రగా గుంటూరు కొరివికారంలాగానే వుంటాడు గోపాలకృష్ణ.

"రెండురోజుల క్రితం ఒకాయనకు హైదరాబాదు బదిలీ అయి వెళ్ళిపోయారు. అందువలన మీకీ అవకాశం లభించింది." అంటూనే రవి సామానంతా జట్కావాడిచేత ఇంట్లో పెట్టించాడు కృష్ణదేవరాయ నగరులో ఉన్న అద్దె యింట్లో.

సాయంకాలం వడగాలి తగ్గినా, రణబండల, రాతిబండలను తోసుకొని వచ్చే గాలిమాత్రం ఇంకా వేడిగానే వుంది. గోపాలకృష్ణమూర్తి బాత్‌రూమ్‌లో ముఖం కడుక్కున్నాడు. తను ముఖం కడుక్కున్నాడు.

"మరి భోజనం" అన్నాడు గోపాలకృష్ణ.

"సాంబారు భోజనం" అన్నాడు రవి నవ్వుతూనే. గోపాలకృష్ణ నవ్వాడు. భోజనం చేసి ప్రయాణ బడలికలో గాఢనిద్ర తీసాడు రవి. తెల్లవారుజామున 4-30కు తెలివి వచ్చింది. కాకులు కూయలేదనిపించినా, అదే సమయానికి తప్ప తనకు తెలివిరాదని రవి కాలకృత్యాలు, ఆసనాలు యివన్నీ తీర్చుకుని, కాస్త ఊళ్ళోకి పోయి కాఫీ త్రాగేటప్పటికి ఏడయింది. ఇంటికి వచ్చేటప్పటికి గోపాలకృష్ణమూర్తి మొఖం కడుక్కుంటున్నాడు. చుట్టూ కాంపౌండు పొదలు.

ఒకచోట బాతురూము నానుకుని ఉన్న జాజిలత చావలేక బ్రతకలేక (శిధిల సామ్రాజ్య వైభవాన్ని చాటే శిధిల సజీవశిల్పంలా) వెదురు బొంగుకు ఆధారంగా యింటికప్పును ఆశ్రయించుకొంది. ఎండిపోయిన కొమ్మలు మధ్య బంగారంలా, నీరెండలో మిలమిలా మెరుస్తున్నాయి. ఇంతమంది యింట్లో పూర్వం నివసించినా బాత్‌రూము నీరు జాజిలతవేపు మళ్ళించాలన్న విషయం అశ్రద్ధచేశారేమో అన్న సందేహం అతనికి కల్గింది. గోపాలకృష్ణ ముఖం తుడుచుకుంటూ దగ్గరకు వచ్చాడు.

"దానికి బాత్‌రూము నీళ్ళను మారిస్తే బాగుంటుంది" అన్నాడు రవి.

"మీకు పువ్వులు యిష్టమా" అన్నాడు గోపాలకృష్ణ.

"పువ్వులు, పిల్లలు, పాటలు, వెన్నెల యిష్టంలేనివారెవరు చెప్పండి?"

"నిజమే" నన్నాడు– సాలోచనగా గోపాలకృష్ణ.

వారంరోజులు ఆఫీసు పనితో, భోజనంతో, నిద్రతో—




ఒకనాటి సాయంకాలం రవి ఆఫీసునుండి ఇల్లు చేరుకునేసరికి పిల్ల లందరూ ఆరుబయట ఆడుకుంటున్నారు. అందంగా, ముచ్చటగా వున్నారు. ఆనందంలో బాధలే మరచిపోయాడు. బాధలు, బాధ్యతలు లేని పసి వయస్సులో తనుగూడ పసివాడయితే బాగుండునేమో ననిపించింది. ఆ భావనతో తృప్తిగా నవ్వుకున్నాడు. రవి పెరట్లోకి వచ్చి జాజిలతవంక చూచాడు. సూర్యుని ప్రభా వానికి తాళలేక తల వేలాడేసింది. ఎండిపోయిన ఆకులు రాలకుండా తలలో నెరసిన వెంట్రుకలలా గలగలలాడుతున్నాయి. లోపలినుండి పెద్ద మేకు తీసు కుని బాత్‌రూమునుండి కాలువ త్రవ్వాడు.

ప్రక్కయింటి కిటికీలోనుండి 'స్టౌ' శబ్దం జోరుగా వినపడుతోంది. చెమటలో నీళ్ళు పోసుకొన్నట్లు అయిందతని శరీరం. ఒకసారి ఆనందంగా స్వయంకృషి సాధించిన ఫలితాన్ని కళ్ళారా చూశాడు. ఆ భావనకు భంగమే కలిగించి, నాలుగు గజాల దూరంలో వున్న కిటికీనుండి ఒకామె నాలుగేళ్ల చిన్న పాపతో జాజిలత వేపు చూస్తున్నది. మెరుపులా చూసి తలవంచుకొని పనిలో నిమగ్నమయిపోయాడు. జాజిలతకు కుండీ త్రవ్వుతుండగా నేలలో విధిలా నిక్షిప్తమయివున్న గాజుపెంకు తగిలి వేళ్ళు తెగాయి.

బాధతో రక్తం ప్రవహించి భూమిని తడిపింది. నరాలు జివ్వుమని లాగాయి. ఆమె చూసింది రక్తం.

"అప్ యిదర్ ఆయియే" అందామె ఆర్ద్రంగా.

అతను కిటికీవద్దకు వెళ్ళాడు. ప్లాస్టిక్ పళ్ళెంలో పంచాదార తెచ్చిందామె. రవి అందులో వేళ్ళుముంచాడు. పాప యిదంతా విచిత్రంగా చూస్తోంది. కిటికీ లోంచి చేతులు చాచింది. గులాబిరంగు చేతులు, చిన్న పెదాలు, పునికిపుచ్చు కున్న అందం, మిన్న అయిన ఎరుపు, తెలుపు రెండు సమపాళ్ళలో కలిసివుండే శరీరం, నీలం నైలాను ఫ్రాకు అందంగా కన్పించి బాధను మరపించేసింది. చేతులను తీసుకొని ముద్దుపెట్టుకోవాలన్న భావాన్ని మన్నుచెయ్యి తుడిచేసింది. "థేంక్సు" అన్నాడు రవి.

ఆమె పళ్ళెం లోపలికి తీసుకుంది. ఏం మాట్లాడాలో తెలియక అతను వెనక్కు వెళ్ళిపోయాడు. ఆ మరునాడు సాయంకాలం జాజిలతకు నీళ్ళుపోస్తు న్నాడు. పనిమనిషి నీళ్ళ ఎక్కువ తేవడానికి డబ్బు ఎక్కువవుతుందని చెపు తోంది. పాప, ఆమె కిటికీలోనుండి చూస్తున్నారు.

పాప నవ్వుతోంది. అప్రయత్నంగానే కాళ్ళు కిటికీవద్దకు వెళ్ళాయి. ఆమె కొంచెం వెనక్కి వెళ్ళింది. "యిలారా" అన్నాడు చేతులు చాపుతూ. పాపని రెండుచేతుల్లోకి తీసుకున్నాడు. అప్పుడే విచ్చిన గులాబిరెక్కలు మంచులో ప్రకాశించినట్లు లేతగా ఉన్నాయి. వాటిని మృదువుగా ముద్దుపెట్టుకున్నాడు. చెంపల మీద చిన్నిచేతులు రాసుకున్నాడు. కలవరమయిన మనస్సు, ఆనందం మిళిత మవుతుండగానే తిరిగివెళ్ళిపోయాడు.

## 2

జాజిలత బాతురూము నీరు పీల్చుకొని చేవదేరుకుంటోంది. నలుపు కలిగిన ఆకుపచ్చదనంలో ఆకులు వూదారంగు వేసినట్లుగా చివుళ్ళు గాలిలో మాట్లాడు కుంటున్నాయి. జాజిలతతోపాటు పాపగూడ రవి హృదయంలో స్థానం సంపా దించేసింది. స్నేహం, ఆప్యాయత, అనుబంధం పాప చిరునవ్వు హృదయంలో ముద్రవేసుకుని దినదిన ప్రవర్ధమాన మవుతున్నాయి. పాప చిరునవ్వులో తన బాధ మరచిపోయి శాంతపడాలని ప్రయత్నిస్తున్నాడు. నిర్లిప్తమై దగాచెందిన బ్రతుకు హృదయంలో తిష్ఠవేసుకు కూర్చుంటే బాధలు, సమస్యలు తాత్కాలి కంగా మరపింపచేస్తూ పాప అతని ఆత్మ ప్రశాంతతకు రూపకల్పన చేస్తున్నది.

రాత్రి గోపాలకృష్ణమూర్తి ఉత్సాహంగా —

"నేను రేపు గుంటూరు వెళ్తున్నా పెళ్ళిచూపులకు" అసలు రహస్యం బయట పెట్టాడు, కొంత సేపటికి.

"వాట్" అన్నాడు రవి ఆశ్చర్యంగా ప్రక్కమీంచి లేచి కూర్చుంటూ.

"కాని నా కిష్టంలేదు. నాకు ప్రేమించి పెళ్ళిచేసుకోవాలనుంది. కాని మా పెద్దవాళ్ళు మాత్రం తక్షణం రమ్మని రాశారు" – అసలు మీ అభిప్రాయ మేమిటో నా ఆశయం విషయంలో."

"ఇదివర కెవరినైనా ప్రేమించారా?"

"ప్రేమించాను. కాని, వాళ్ళకి పెళ్ళిళ్ళయిపోయాయి." అన్నాడు అమాయకంగా.

రవికి నవ్వు వచ్చింది– కాని ఆపుకుంటూ–

"కారణం?" ప్రశ్నించాడు.

"కులం, మతం, వర్గం యివన్నీ సమస్యలయ్యాయి."

"మరి కట్నం దగ్గర–" రవి ప్రశ్నించాడు.

"అవికూడా వచ్చాయనుకోండి."

"చూడండి, సంస్కారం, కోరిక అనే రెండు ప్రాణాలు సమాజం క్రింద బడి నలిగిపోతున్నాయి. ప్రేమించుకొని పెళ్ళిచేసుకొనే అవకాశాలు చాలా తక్కువ మనకు. మన మేదో అభ్యుదయపథం అంటూ ముందడుగు వేసినా ఆడపిల్లల తలిదండ్రులు ఒప్పుకోరు. ఒక విధంగా సంస్కారం కాకపోయినా యువరక్తంలో ప్రవహించే ఆరాధనాభావం భవిష్యతు మరపింపచేసి నైతికంగా దిగజారుస్తుంది. ఇది అందరిపట్ల వర్తించదనుకోండి. ముఖ్యంగా దీనికి కావలసింది మానసిక ధైర్యం. ఏ జీవితమైతే మనకు సుఖప్రదంగా వుంటుందని భావించుతామో అది మనకు ఒక సమయంలో విషపూరితంగా తయారవుతుంది. ఈలాంటి కొన్ని అన్వేషణలకు కొన్ని సరిహద్దులు మనం నిర్ణయించుకొన్నపుడే మనం అనుకున్నంత కన్నా యెక్కువగా జీవితం రాణిస్తుంది. అవతల వ్యక్తిని అర్థంచేసుకోవడానికి తగిన అవకాశాలు పెళ్ళికిపూర్వం లేకపోయినా తరువాత మంచితనంతో అర్థంచేసుకోవచ్చు. అందువలన శీఘ్రంగా తథాస్తు అనిపించుకుని రండి" అన్నాడు రవి ఆవలిస్తూ.

అవును కాబోలనుకున్నాడు గోపాలకృష్ణ.

మరునాడు సాయంకాలం కాబోయే పెండ్లికొడుకుని రైలెక్కించి వచ్చాడు. దారిలో చాకలెట్లు కొన్నాడు. మన హృదయం కల్మషరహితంగానే ఉంటే

ఎదుటివారు కూడ అలాగే ప్రవర్తిస్తారని అతని భావన. ఆ భావనలోనే పాప వాళ్ళింటికి చేరుకున్నాడు. ఆమె పాపకు తల దువ్వుతోంది. అతని రాకను చూసి నంతలో.... "కూర్చోండి" అని ఆహ్వానించింది. ఆ ఆహ్వానంలో మర్యాద, అప్యాయత నిండుకుంది. పాప నేరుగా వచ్చి ఒళ్ళో కూర్చుంది. చాకలెట్లు అందించాడు. చిన్ని చేతులలో పట్టక క్రిందపడిపోయాయి. అవి తీసి టేబులు మీదుంచాడు. ఆమె లోపలికి వెళ్ళింది. ఇల్లంతా అధునికంగా అలంకరించబడి ధనికత్వపు నాగరికత వెదజల్లుతోంది. పాప ఒళ్ళో కూర్చొని అతని బుష్షర్టు నైలాను బొత్తాలు త్రిప్పుతోంది. నున్నని గులాబిరంగు పాలబుగ్గలు ముద్దుపెట్టు కున్నాడు.

ఆమె ట్రేతో టీ పట్టుకొచ్చి రెండో సోఫాలో కూర్చుని టీ తయారుచేసి యిచ్చింది. ఆమె వేలి వుంగరం ఒంటి పొడికెంపు మెరుస్తోంది.

"మీరు పాపను గురించి చాల శ్రమ తీసుకున్నారు." వసంతకాలంలో లేతమామిళ్ళ చివురులు తిన్న కోయిలలా వుందామె కంఠం. వచ్చీ రాని తెలుగు— ఒక విధమైన యాసతో మాట్లాడుతోంటే చాలా బాగుంది.

"ఇందులో శ్రమేముందండీ— పాప పేరు?" అన్నాడు.

"అంజలి" చెప్పిందామె. పాప అతని జేబులోంచి పెన్ను తీసుకుంది. ఆమె పాపను వాళ్ళ భాషలో ఏమో అంది కోపం అభినయిస్తూ. పాప కిలకిలా నవ్వింది.

"మీ దేవూరు—" అనడిగిందామె.

రవి చెప్పాడు. దూరంకూడా మైళ్ళలో.

"అయితే బొంబాయికన్న దూరమే నన్నమాట." ఫేనుగాలికి ముంగురు లామె వదనంపై ఆడుకుంటున్నాయి. శంఖంలాంటి ఆమె కంఠంలో మంచినీరు త్రాగినా కనబడుతున్నంత స్వచ్ఛంగా వుంది.

టీ చల్లారిపోతుంది" ఆమె హెచ్చరించింది.

"టీ త్రాగుతూనే రవి తన విషయమంతా చెప్పాడు. ఆమె విచారించింది, సానుభూతితో హృదయం నిండుకుంటూంటే.

సానుభూతి చూపడానికి అనుభవం అక్కర్లేదు. ఎదుటి వ్యక్తులు సహృదయంతో కష్టసుఖాలు శాంతంగా లీనమై వింటున్నప్పుడు, ఆత్మీయత ఏర్పడి కొన్ని జీవిత సత్యాలు చెప్పగలం. రవి చెప్పుకుపోతున్నాడు.

"దేవుడు నన్ను ఎంత హింసించినా బాధపడలేదు. తండ్రిపోయిన తరు

వాత బంధువులు హీనంగా చూసారు. ఆకలిదప్పులతో నేను, మా అమ్మ కొంత కాలం పస్తులుకూడా వున్నాం. మా అమ్మ ఆత్మాభిమానం అట్లాంటిది. నన్ను జీవితంలో పునాదుల్ని కదిలించివేసింది మా అమ్మ చరమదశ" కాస్సేపాగాడు రవి.

ఆమె అతనివంక నిశ్చలంగా చూస్తూంది.

"ఇవాళ మీతో ఏమేమో చెబుతున్నాను. ఎందుకు చెబుతున్నానో నాకే అర్థంకాదు. నాకు చెప్పాలనిపిస్తోంది. నేను టెంపరరీ గుమాస్తాగా ఉద్యోగం చేస్తూండేవాణ్ణి. నా ఉద్యోగం పోయిందని ఎవరో చెప్పారు. అంతే.... ఆమె బెంగతో మంచమెక్కింది. కొన్నాళ్ళకు చనిపోయింది. ఈ చావుకు ఎవరు కర్తలు? ఎవరు బాధ్యులు? ఆశలు, మమతలు, వీటన్నిటికీ దూరమయి దిక్కు లేనివాడి నయిపోయినాను."

అతని కంఠం గాద్గదికమైపోయింది; మాట్లాడలేకపోయాడు.

"యిన్ని బాధలు మీరు ఎలా భరించగలుగుతున్నారు?"అడిగిందామె, విషణ్ణ వదనంతో. కొన్ని జీవిత సత్యాలను పసిగట్టిన ఆమె హృదయం ఆక్రోశించి ఉండవచ్చు. ఆమె కళ్ళు చెమ్మగిల్లాయి.

రవి వేదాంతిలా నవ్వాడు.

'ప్రతీ వ్యక్తికీ జీవితంలో రెండే దశలు. ఉజ్వలంగా వెలిగే దశ, హీనంగా కృంగే దశ. చీకటిలో బ్రతుకుదామని, శూన్యంలో తలదాచుకుందామని నాకు లేదు. నాకు వెలుగు కావాలి. కానీ ఎలా వస్తుంది. అందువలననే కర్మ సిద్ధాంతాన్ని ఆధారంగా తీసుకుని బ్రతుకుతున్నాను. సుఖం యిలా వుంటుందని, కనీసం వూహించుకోలేనన్ని కష్టాలలో యీదులాడాను. భగవంతుడు చేయని పాపానికి శిక్ష విధించినపుడు చేసిన పుణ్యానికి పరిహారం యెందుకు చెల్లించడు. అదృష్టదేవత నా నెత్తిన కిరీటంపెట్టి, సామ్రాజ్య పట్టాభిషేకం చేయమని కోరటంలేదు. జీవితంలో కనీసపు సుఖం అనుభవించటానికి నాకు హక్కులేదా? యేమిటీ జీవితానికి అర్థం" అన్నాడు ఒడిలో పాపను తీసుకుంటూ.

క్షణం సేపు నిశబ్దం.

ఆమె హృదయం ఆర్ద్రమైంది.

"నిజమేనండీ. బాధ్యతల బరువు, కష్టాల బరువు మనస్సును దాడిచేసి, గాయం చేసినపుడు, ఒక దశలో జీవితంమీద నిర్లక్ష్యం యేర్పడుతుంది. నేను జీవితమంతా ఒక జూదంలాంటి దంటాను. గెలిచినవారు యింకా గెలవాలని,

ఓడినవారికి గెలుపు ఎపుడేనా తథ్యమని ఆశ వుంటుంది. జీవితం యిలాంటి అనుభవాల మధ్య నలిగిపోయినపుడు సంసారానికి తావు వుండదనుకుంటాను." అందామె అనునయంగా.

సాయంసంధ్య లేత కుంకుమరాసిలా వొకవైపు ఆకాశంలో ప్రకాశిస్తున్నది.

"అందుకనే జీవితం మీద ఆలోచించటం మానేశాను. జీవితానికి ప్రశాంతత, మానవత్వం చరమదశలోనే సిద్ధిస్తుంది. యిలాంటి విపరీతపు ఆలోచనలు యీ వయస్సులో భరించలేకుండా పోతున్నాను.

అందువలననే పసిపాపల కళ్ళల్లో, నవ్వుల్లో, మనసుల్లో కలిసిపోయి కరిగిపోయి, అతని ప్రశాంతతకు చోటువెతుక్కుండా మనిపిస్తుంది. అందువలననే పసిపాపలన్నా నాకు చాలా యిష్టం" అన్నాడు రవి.

"అయితే మీరు మా యింట్లో వుండిపొండి, మా పాపాయితోపాటు," అందామె నవ్వుతూ. రవి నవ్వాడు.

"నేను చాలా చెప్పాలి."


"నేను చెప్పలేదనా; వినండి. నా పేరు చందన్. బరోడా యూనివర్సిటీలో బి.ఎ. చదివాను. మా అమ్మ లేదు. నాన్నగారు బొంబాయిలో వ్యాపారం. పాప నాన్నగారికి పెద్ద బిజినెసే. లక్షలు సంపాదిస్తున్నా ఆయనకు తృప్తి లేదు. నెలకు రెండు, మూడుసార్లు వస్తారు. ఒంటరితనం, పుస్తకాలు, రేడియో, స్వజాతీయులు.... యిప్పుడు మీరు నా స్నేహితులు." అంతా విని స్వచ్ఛందంగా నవ్వుతూ. ఆ నవ్వులో యేదో బాధ వుంది.

సంస్కారం, ధనం, హోదావున్న వ్యక్తులు కూడా తీయనైన చేదు బాధలు అనుభవిస్తున్నారు. రెండు రకాల జీవితాలు సమాజంలో వ్యక్తులు అలవర్చుకున్నారు.

రవి శలవు తీసుకుని యింటికి వచ్చేశాడు, ఆలోచించుకుంటూ. భవిష్యత్తులో శూన్యం మనస్సును నిర్లిప్తతచేసి, ఆత్మతో సంఘర్షణ పడుతున్నది. యెందుకు వచ్చేమో యింతదూరం అనుకొన్నాడు. గోపాలకృష్ణ వూరినుండి వచ్చేశాడు. పెళ్ళి వైశాఖమాసంలో అని చెప్పాడు.

ప్రతి సాయంకాలం రవి పాపతో కబుర్లు చెప్పుకునేవాడు; చందన్ గూడా సరదాగా కుట్టుకుంటూ వాళ్ళ సంభాషణలో పాల్గొనేది.

ఒకనాడు సాయంకాలం ఆమె భర్తకు రవిని పరిచయం చేసింది. స్వచ్ఛ




మైన రెండు మల్లెపువ్వుల్లాంటి హృదయాల్లో స్నేహం కలిగింది. ఆయన ఆప్యా యంగా మాట్లాడాడు. "మీ తెలుగువారు విశాల హృదయులు. కష్టపడి పనిచేసే వారు." అన్నారు టీ త్రాగుతూ. రవి చిరునవ్వు నవ్వాడు.

ఈ మధ్య పాప 'లవీజీ' అని పిలవటం నేర్చుకుంది. అలా పిలిచినప్పు డల్లా అతనూ, ఆమె నవ్వుతూ వుండేవారు. ఆ పిలుపు చాలా తమాషాగా వుండేది. క్రమేపీ పాప సన్నిహితురాలై పోయింది. ఊహకందని ఆత్మీయత, అనుబంధం అతని హృదయాన్ని పరవశత్వంలో ముంచుతున్నది. మానసిక మైన వేదన చాలా దూరం పారిపోయింది.

ఒకనాటి రాత్రి పనిమనిషి రవిని నిద్రనుండి లేపింది. రవి నిద్రమత్తు లోనే 'యేం' అని అడిగాడు. సాయంత్రం వరకూ ప్రశాంతంగా వుండే ఆకాశం పున్నమిచంద్రుడ్ని మ్రింగి గాలిలో ప్రళయాన్ని సృష్టించబోతున్నది.

"అమ్మగారు మిమ్మల్ని పిలుచుకరమ్మన్నారు. పాపకు వొంట్లో యేం బాగుండటంలేదు" ఆ మాట వినగానే రవి దిగ్గునలేచి రెండంగల్లో యింటికి చేరుకున్నాడు.

అంతకు ముందుగా రెండురోజుల నుండీ పాప వొంట్లో నలతగా వుంది. డాక్టరు మందు యిస్తూండేవాడు. మంచంమీద పాప కాళ్ళూ, చేతులూ కొట్టు కుంటున్నది. ఆమె యేమీ చేయలేని నిస్సహాయ స్థితిలో వుంది. రవి పాపను

చూచి, తొందరగా డాక్టరును పిలుచుకు వచ్చాడు. తొందర్లో సూదిరాయి తగిలి, బొటనవేలు గాయపడింది. డాక్టరు యింజక్షనిచ్చాడు. యెక్కడో పిడుగుపడ్డది. ఆకాశం మేఘాలలో ప్రకృతిమీద యుద్ధానికి సిద్ధంకమ్మని హెచ్చరిస్తున్నది. దీపం క్రీనీడలో గాజు కిటికీలోనుండి జాజిలత గాలికి విలవిలలాడుతున్నది.

"కేస్ చాలా సీరియస్— ఈ రాత్రి గడిస్తే...." డాక్టరు గుమ్మం దిగుతూ అన్నమాటలు చెవిలో గింగురుమంటున్నాయి. చందన్‌గూడా గుమ్మంవరకూ వచ్చి ఆ మాటలు విందన్న సంగతి అతనికి తెలియదు.

పనిమనిషి గోడకు చేరబడి కునికిపాట్లు పడుతున్నది. చందన్ బలవంతంగా వచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ కన్నీరు కారుస్తున్నది. అప్పుడప్పుడు పాపను జాలిగా తాకుతున్నది. పిచ్చిగాలికి కిటికీ రెక్కల తలుపులు కొట్టుకుంటున్నాయి.

వెలుతురు, చీకటి కలసిన మెరుపుల్లో జాజిలత స్పష్టంగా కనిపించుతున్నది. దానికి ఆధారమైన వెదురుబొంగు గాలిని భరించలేక, యెదిరించలేక విరిగిపోయింది. అయినా లత నేలకి పడిపోక యింటిమీదకు ప్రాకిన ఆధారంతో నిలిచి గాలితో దెబ్బలాడుతున్నది.

జాజిలత గాలి తాకిడిని భరించలేక, యెప్పుడేనా నేలరాలిపోవచ్చు. సౌందర్యం, సౌరభ్యం, సౌమ్యత వెదజల్లే పువ్వులూ, మొగ్గలూ, ఆకులు యివన్నీ మట్టిలో కలిసిపోవచ్చు. ఈ ఆలోచనలతో జాజిలతను చివరిసారిగా చూస్తూ, ఉద్రిక్తమైన గాలిని భరించలేక, కిటికీ తలుపులు వేశాడు. నిశ్శబ్దంగా కాసేపు కూర్చున్నాడు.

పాపలో చలనం లేదు. జీవం మృత్యువుతో పోరాడే సమయంలో, శరీరం మైకంలోపడి ప్రశాంతతను అనుభవిస్తుందేమో! అతను జాలిగా ఆమెవైపు చూశాడు. ఆమె చేయి పాప వొంటిమీదనే వుంది. దుఃఖంలో మైకం కమ్మి ఆమెకు నిద్రవచ్చింది. కాని రవికి నిద్రరాదు— రాలేదు. మానవత్వం అతని హృదయంలో కర్తవ్యాన్ని కరచిపట్టుకుని వుంది. ఆమెకు లేత వయస్సయినా, ఆ మాతృత్వం తీపి ఆమె వయస్సును పెంచేసింది. దారుణమైన అనుభవాలకు తట్టుకోవలసిన తీగలాంటి హృదయం ఆమెది.

జాజిలతను కిటికీ తలుపులు తీసి చూద్దామనుకున్నాడు. కానీ చూడలేకపోయాడు.

"చందన్" అన్నాడు రవి. ఆమె పలకలేదు. నిద్రలోనే శోష వచ్చిందేమో ననుకున్నాడు. భుజాలమీద చేయివేసి పిల్చాడు. ఆమె వులిక్కిపడి లేచింది. లేవడంలో ఆమె తూలింది. రవి ఆమెను పొదివి పట్టుకున్నాడు. ఆమెకు స్పృహ తప్పింది. యెండ వేడికి తలవాల్చిన తీగలా, అతని భుజాల మీద వాలిపోయింది. జాగ్రత్తగా ఆమెను బెడ్‌మీదకు చేర్చాడు. ఫేన్ వేశాడు. కూజాలో నీళ్ళు తెచ్చి ముఖంమీద జల్లాడు. ఫ్లాస్కులోని వేడినీటితో హార్లిక్సు కలిపి సిద్ధంచేశాడు. ఆమె కొంచం అటు, యిటు కదిలింది. తెలివివచ్చి లేవబోయింది. ఆమెను వారించి, "లేవకండి, నీరసంగా వున్నారు" అంటూ హార్లిక్సు అందించాడు.

"పాప యెలా వుంది" అంది నీరసంగా చందన్.

"పాపకేం ఫర్వాలేదు. నిక్షేపంలా వుంటుంది. మీరు విశ్రాంతి తీసుకోండి. అవసరమయితే లేపుతాను" అన్నాడు బాధ్యతాయుతమైన స్వరంతో.

పాపదగ్గరకు వచ్చాడు. అరగంట తరువాత పాప కదిలింది. డాక్టరు పట్టమన్న మందు పట్టాడు. కొంతసేపటికి పాప వొంటినిండా చెమట పట్టింది. కళ్ళల్లో వత్తులు పెట్టుకుని చూడాల్సిన క్షణాలు తప్పిపోయాయి. హృదయం తేలికై, సంతృప్తిని పొందింది. తెల్లవారేసరికి పాపాయి చూస్తున్నది. చందన్ లేచి పాపను ముద్దుపెట్టుకుంది. డాక్టర్ వచ్చి మందిచ్చాడు. రవి యింటికి వెళ్ళాడు. బట్టలు మార్చుకునేటప్పుడు సన్నని, పొడుగాటి శిరోజం అతని షర్టుని అంటుకొని వుంది. దాన్ని పదిలంగా డైరీలో దాచుకున్నాడు. ఆ మధ్యాహ్నం జాజిలతకి వెదురు ఆధారంచేసి ధృఢంగా నాటాడు. లత అప్పుడే చిన్నచిన్న మొగ్గలతో, విచ్చీవిచ్చని పూవులతో అందంగా తయారయింది.

ఒకనాటి సాయంత్రం చందన్ భర్త రవి చేతులు పట్టుకున్నాడు కృతజ్ఞతా పూర్వకంగా.

"మీరు నిజంగా దేవుదే. పాప ప్రాణాలు, మా ప్రాణాలు రక్షించారు. చాలా కృతజ్ఞుణ్ణి. చందన్ చెప్పింది" అన్నాడు. రవి చందన్‌వైపు చూశాడు. ఆమె కళ్ళు చెమ్మగిల్లి వున్నాయి. ఆ సాయంకాలం వాళ్ళందరితో 'రాఖీ బంధన్' సినిమాకు వెళ్ళాడు రవి.

నాలుగు రోజుల తరువాత రవికి, వాళ్ళ జిల్లాలోనే పోష్టాఫీసులో గుమాస్తా ట్రెయినింగుకు ఆర్డర్లు వచ్చాయి. ఉద్యోగానికి రాజీనామా పై ఆఫీసరుకు పంపించి, ఆనందంతో యింటికి వచ్చాడు. తల దువ్వుకుంటూ వుండగానే పాప

వచ్చింది. పాపను యెత్తుకుని, వాళ్ళ యింటికి వెళ్ళాడు. ఆమె కనకాంబరం పట్టుచీర కట్టుకొని, వొంటిపేట ముత్యాలహారం మెళ్ళో వేసుకుని, కూర్చొని యేదో కుడుతున్నది.

"ఎక్కడికయినా వెళ్ళారా?" అనడిగాడు.

"అవును, చుట్టాలింటికి వెళ్ళాను," అని నవ్వింది చందన్. తాంబూలం వేసుకుంది కాబోలు— పెదవులు ఎర్రగా దొండపండులా వున్నాయి.

రవి చెప్పేడు తన వుద్యోగం సంగతి. ఆమె సంతోషించింది. కొద్ది క్షణాల తరువాత లేచి కిటికీలో జాజిలతను చూస్తూ నిలబడ్డది. రవి టీ త్రాగుతూ చెప్పుకుపోతున్నాడు హుషారుగా.

"నిప్పుమీద మంచు కురిసినట్లు, నా దైన్యం జీవితాన్ని వెన్నాడి, యింతవరకు యిప్పడయినా నన్ను వదలిపెడుతున్నందుకు చాలా సంతోషం. నా సమస్యలు కొన్ని దైవికంగా విడిపోతున్నాయి...." యింకా చెప్పబోయి రవి ఆగిపోయాడు. కిటికీ దగ్గరకు వెళ్ళాడు.

ఆశ్చర్యం! చూచి చకితుడయ్యాడు. ఆమె కళ్ళలో గోదావరి పొంగుతోంది.

క్షణంసేపు ఆగి,

"నన్ను ఈ రోజు పిచ్చివాడిగా తయారుచేస్తారా?" అనడిగాడు రవి గాద్గదతతో.

సాయంకాలం నీరెండ ఆమె ముత్యాలహారంమీద పడి, ఎరుపును వెద జల్లుతున్నది.


"లేదు, నేనే పిచ్చిదాన్నవుతానేమో!"

"యిదంతా శాశ్వత మనుకుంటున్నారా?"

ఆమె మాట్లాడలేదు. అతను ప్రారంభించాడు. "కేవలం భ్రమ. యేది యే క్షణాన జరుగుతుందో మనకే తెలియదు. యిది భ్రమ కానపుడు మనలో పాపం, పుణ్యం, స్వార్థం, నిస్స్వార్థం యిలాంటివి వుండవు. ముందు కళ్ళు తుడుచుకోండి" అన్నాడు రవి మృదువుగా.

"కానీ నే నిది భరించలేను" అందామె. కంఠస్వరం నూతిలోంచి వచ్చి నట్లుగా వుంది.

"యేమిటి!" అతను నిరుత్తరుడై అడిగాడు.




"యేమో చెప్పలేను" అందామె. అతను వెంటనే జేబురుమాలుతో కళ్ళు తుడిచాడు. ఆమె చేతులు పట్టుకున్నాడు. వణుకుతున్న దామె— శరాఘాతం తగిలిన పావురంలా.

"మీతో చాలా మాట్లాడాలి, కూర్చోండి" అని సోఫాలో కూర్చోబెట్టాడు. అలాంటి సమయంలో కాలం అమూల్యమైపోయింది. ఆలోచనలు స్తంభించి పోయాయి. ఆమె దుఃఖాన్ని నిగ్రహించుకుంది.

రవి యేదో చెబుదామని నోరు తెరిచాడు కానీ వెంటనే లేచి నిల్చున్నాడు.

"యివాళ యేమీ చెప్పలేను. రేపు చెబుతా" అని గుమ్మం దిగి వెళ్ళి పోయాడు చివాల్న. ఆమె నిశ్చేష్టితురాలైంది.

ఉదయం రవిని పాపే లేపింది. "అప్పుడే స్నానం చేశాను సుమా" అన్న విషయం మార్గోసబ్బు చల్లని సువాసనలు వెదజల్లుతున్నది. తొందరగా స్నానంచేసి, రవి వాళ్ళింటి కెళ్ళాడు.

"గుడ్‌న్యూస్. కంగ్రాచ్యులేషన్సు" అన్నాడాయన. కృతజ్ఞతా సూచకంగా చిరునవ్వు నవ్వాడు. రవి ఆ రోజు భోజనం వాళ్ళింట్లోనే. భోజనంలో "మీరు మొగమాటపడుతున్నారు," అంది చందన్. మాటలు భారంగా వున్నా. దాపల్లాంటి కళ్లు యెర్రగా వున్నాయి. తరువాత ముగ్గురూ పేక కలిపారు, సాయంకాలం 4 గంటల సమయం వరకూ. చందన్ "టీ" తెచ్చి ఇచ్చింది. చందన్ భర్త నాలుగున్నర గంటలకు బొంబాయి ప్రయాణం. టాంగామీద వెళ్ళి రవి దిగబెట్టాడు.

"ఉద్యోగంలో జాయినయిన తరువాత ఉత్తరం రాయండి. మనం తిరిగి కలుస్తాం. పోతే దగ్గరగా వుండే బదులు దూరంగా వుంటాం...." ఇంక

ఆయన మాటలు వినబడడంలేదు. రైలు కదలిపోయింది. పాపనెత్తుకుని, తిరిగి చందన్‌వద్దకు వచ్చాడు.

"రైలందిందా" అనడిగింది చందన్. అందిందని చెప్పాడు.

"నేనూ రేపు సాయంకాలం ప్రయాణం నిశ్చయించాను" అన్నాడు రవి. ఆమె ఆశ్చర్యంగా కళ్ళు పెద్దవి చేసింది. మర్నాడుదయం గోపాలకృష్ణ టీపార్టీ, ఫోటో మొదలయిన తతంగం. తర్వాత షాపింగు చేసుకుని పదిగంటలకు వచ్చాడు రవి. జాజిలత వద్దకు వెళ్లాడు 'జాజిలతకు తెలియదు నేను వెళ్ళిపో తున్నా'నని అనుకున్నాడు. జాజిలత గాలితో ఆడుకుంటూ, అందంగా తల వూపుతోంది. చిన్నలత కొమ్మను, పువ్వులతో తెంపాడు. బట్టల పెట్టిలో పెట్టాడు. ఆకుపచ్చ పెర్రికాట్ ఫ్రాక్‌లో ముత్యాలహారం పెట్టుకుని, పాప వచ్చింది. చందన్ ఇంటికి వెళ్ళాడు రవి, పాపతో.

చందన్ తెల్ల గ్లాస్కో చీరమీద తెల్లని చోళీ వేసుకుని, ముత్యాల గాజులు ధరించి, ముత్యాలకర్ణాభరణాలు పెట్టుకుంది. అలంకరణ చాలా సౌమ్యంగా వుంది. నిరాడంబరంగా వుంది.

"ఇదంతా మిత్రుడికి వీడ్కోలు సన్నాహమా" అన్నాడు. నిలువు టద్ద ములో ఆమె ప్రతిబింబాన్నీ చూస్తూ ఆమె నవ్వింది విషాదంగా. విందుభోజనా లవీ, అవగానే.

"నా జ్ఞాపకార్థం మీకు యివి" అంటూ యిచ్చాడు

ఆమె చూసింది. కుంకుమతో నిండిన వెండి భరణి, ఏపిల్సు, బత్తాయిలు వున్నాయి.

ఆమె మౌనంగా వాటిని తీసుకుంది.

నేను జన్మదరిద్రుణ్ణి. నా దారిద్ర్యం నన్ను కప్పేస్తూ జీవితంలో ఆశలు మొలవనివ్వకుండా శూన్యంలోకి, చీకటిలోకి లాక్కుపోయింది. ఈ జాజిలత, దానితోపాటు స్నేహమైన పాప, మీరు, ఆయన, మీ ఆప్యాయత అభిమానం యివన్నీ నా జీవితంలో, హృదయంలో, శాశ్వతమైన ముద్ర వేసుకుపోయినాయి. వీటన్నిటికన్నా వుత్తమమయినదీ, శాశ్వతమయినదీ యివ్వడానికి నా దగ్గర యేమీలేదు. చివరికి పాపకు కూడా యివ్వడానికి నా దగ్గర యేమీ లేదు.

....రవి కండ్లలో నీరు తిరిగి, నిలువుటద్దంలో ప్రతిబింబం కనిపించ

లేదు. ఆమె యింక వినలేకపోయింది. వెంటనే లేచి, అతని పెదవులను సున్నితంగా వేళ్ళతో మూసింది.

"చందన్" అంటూ ఆర్ద్రంగా ఆమెను కౌగలించుకున్నాడు. యిదంతా లిప్తలో జరిగింది. అతని చొక్కా ఆమె కన్నీరుతో తడిసింది.

స్వచ్ఛమైన అతని ఆర్ద్రతలో, సౌందర్య తృష్ణ లేదు. యే కవీ వర్ణించ డానికి వీలులేనిది, యే విమర్శకుని భావాని కందనిదీ, సమాజం అర్థంచేసుకో లేని ఆత్మీయత వాళ్ళ హృదయాల్లో ప్రవహించుతోంది. రక్తసంబంధం దీని ముందు బలాదూర్.

"మీ రలా మాట్లాడకండి. రోజులు మంచివి వస్తున్నాయి. మీ అదృష్టం మారుతుంది. దిగులుపడకండి. మీరు జాజిలతను పెంచినట్లే జీవితంలో ఆశలు పెంచుకున్నట్లయితే, ఫలితం యెప్పటికయినా కన్పిస్తుంది.... మీరు జాజిలతనే జీవితంలో ఉపమానంగా తీసుకోండి" అందామె అతని కౌగిలిలో.

"అదిగాదు చందన్. యింత స్వచ్ఛమయిన వాతావరణం, మల్లెలాంటి మనస్సుగల వ్యక్తులు విడిపోతున్నందుకు నేను యెంత ఆవేదన పడుతున్నానో, యెంత బాధ అనుభవిస్తున్నానో భగవంతుడికి తెలుసు." అంటూ ఆమె కన్నీ ళ్ళను తుడిచాడు.

కొత్త కుంకుమభరణిలో కుంకుమవేసి, నుదుటిమీద కొంచం వుంచాడు.

బరువైన హృదయాలు తేలికై పోయాయి.

"మమ్మల్ని మర్చిపోరుకదూ" అందామె దీనంగా. తడి ఆరని కన్నీటి రెప్పల క్రింద కళ్ళు చేపల్లా మెరుస్తున్నాయి. నాలుగుగంటల వరకూ యేవో చాలా మాట్లాడుకున్నారు. టాంగాలో గోపాలకృష్ణ సామాను పెట్టించాడు. చందన్ యింట్లోనుండి పనిమనిషి సూట్ కేస్ తెచ్చిపెట్టింది. అడిగితే 'స్వీట్సు' అని చెప్పింది.

యేవో జ్ఞాపకంవచ్చి జాజిలతవద్దకు వెళ్ళాడు. జాజి నీడలో దిగాలుగా వున్నట్లు కనిపించింది.

చివరిసారిగా, బొచ్చెం నీళ్ళు లత మొదట్లో పోశాడు. ఆ నీళ్ళలో అతని కన్నీళ్ళు గూడా కలిసిపోయాయి. ఎడతెగని సంబంధం, ఆప్యాయత, వొక స్థావరమయిన వస్తువులో తిరిగి చందన్‌వద్దకు వచ్చాడు రవి. తటాలున ఆమె అతని పాదాలకు ప్రణామం చేసింది. "వెళ్ళిపోయే ముందు నన్నాశీర్వ దించండి" అన్నదామె గాద్గదికంగా. కన్నీటి బొట్లు రవి పాదాలను తాకుతున్నాయి.

అతను నిశ్చేష్టుడయ్యాడు.

"నే నే స్థితిలో వున్నా సరే, యెక్కడ వున్నా సరే, మిమ్మల్ని అభివృద్ధిలోకి తేవాలని, మీ అందరి మనస్సులు నిర్మలంగా, జాజిపువ్వులా పవిత్రంగా వుంచి, ఆయురారోగ్యాలు యివ్వమని ఆ దేవుణ్ణి ప్రార్థిస్తాను" అంటూ ఆమెను లేవదీసి, నుదుటిపై ముద్దు పెట్టుకున్నాడు. తర్వాత రాఖీ కట్టింది. రైలుకు టైమయిపోయింది. పాప వస్తానని యేడిస్తే టాంగాలో కూర్చోబెట్టాడు. చందన్ సజలనయనాలతో వీడ్కోలు యిచ్చింది. టాంగా కదిలిపోయింది.

రైలు అరగంట లేటు.

వెయిటింగ్‌రూమ్‌లో గోపాలకృష్ణ "మీరు వెళ్ళటం నాకు చాలా భారంగా వుంది" అన్నాడు చివరికి.

"నాకూ అలానే వుంది. కానీ తప్పదు. హృదయంలో నాకో చిన్న అర వుంది. అందులో మిమ్మల్నందర్నీ దాచుకున్నా. రోజూ కావల్సినపుడల్లా ఆ అర తెరచి మీతో మాట్లాడుకుంటా. అందువలననే మనం కొన్ని వందల మైళ్ళ దూరంలో వున్నా మీ రందరూ నాతో చాలా దగ్గరగా వుంటారు" బాధగా అన్నాడు రవి.

రైలు వచ్చేసింది. పాప రవిని విడిచి రానని మారాము చేస్తోంది. గార్డు విజిల్ వేశాడు. చివరకు బలవంతంమీద గోపాలకృష్ణ పాపను తీసుకున్నాడు. రైలు కదిలిపోయింది. రవి వూపుతున్న చెయ్యి గూడా కన్నీటి పొరల మధ్య కన్పించిలేకపోయింది గోపాలకృష్ణకు.

నంద్యాల పోలీసుస్టేషను వరకు రవి జాజిపూల స్మృతులను మననం చేసుకుంటున్నాడు. బండి నంద్యాల స్టేషనులో ఆగింది. రవి సూట్‌కేస్ తెరిచాడు. అందులో స్వీట్లు, వాడిపోని జాజిపువ్వులు.... వాక పార్కరు పెన్ను, కెంపు వుంగరం, పాలరాతి తాజ్‌మహల్ వున్నాయ్.

'యెందు కిలా చేశావ్ చందన్' అని గొణుక్కున్నాడు బాధగా. రైలు కీచుమంటూ కూతవేసి యిదంతా తనకేమి పట్టనట్లుగా, విన్పించనట్లుగా, ఆకాశం మీద నక్షత్రాలు నవ్వుతూంటే చీకటిని కోసుకుంటూ బయలుదేరింది. రైలు కూతతోబాటు అతనూ కదలిపోయాడు యింకో స్థలంలో కొత్త జీవితాన్ని ప్రారంభించడానికి.

---